

# కల్యాణి కలలు

'చినవెంకటి'

పదహారేళ్ళ కల్యాణికి కలొచ్చింది. కలంటే ఏమొచ్చిందీ చెప్పే ముందు ఎట్లాంటి పరిస్థితుల్లో కలొచ్చిందీ చెబుతాను. వాళ్ళ అమ్మ, నాన్న వాళ్ల అమ్మాయి పెళ్లికోసం బహు తాపత్రయపడుతున్నారు. నాన్న రోజూ రాత్రిపూట ఇంటికొచ్చినప్పుడల్లా అమ్మ నాన్నను కదిలిస్తూనే ఉండేది. 'ఏమండీ! ఏమైం'దని. నాన్నగూడా ఏదో సమాధానం చెబుతూనే ఉండేవాడు; 'వాళ్లు పిల్లను చూచుకోటానికి వస్తా'రనో, 'వాళ్ళు యింకో సంబంధం చూచుకుంటున్నా'రనో, 'వాళ్ళ అబ్బాయికి మూడువేల కట్నమిచ్చి పట్నంలో చదువు చెప్పించాలంటున్నా'రనో, 'వాళ్ళ సంబంధం చిట్టిపోయినట్లే'ననో ఇట్లాంటివే ఏవో. నాలుగైదుసార్లు ఎవరో తనను చూచుకుపోవటానిగ్గూడా వచ్చారు. ఒకొక్కప్పుడు పిల్లాడు రాకుండా పెద్దవాళ్ళే వచ్చేవాళ్ళు. పెద్దవాళ్ళు చూస్తే పిల్లాడికి తృప్తిట, నచ్చుతుందిట. మరి తన సంగతో? తన కాపిల్లాణ్ణి చూచినాగూడా నచ్చుతుందా లేదా అనే విషయం ఎవ్వరికీ పట్టదేం? ఆ చూట్టానికి వచ్చేవాళ్లను చూచే తనూ కడుపు నింపుకోవాల్నని అందరి ఉద్దేశ్యమూ గామాలు. ఏమో, ఏమైనా కలకు సంబంధించినంతవరకూ సంబంధాల సంగతి అంతవరకే.

తరువాతి విషయం: కల్యాణి స్కూల్లో చదువుతోంది, అక్కడా అదేగొడవ. ఆడపిల్లల బెంచీ తూర్పు మొహంగా ఉంటుంది. మొగపిల్లల బెంచీలు ఉత్తర మొహంగా ఉంటయ్. ఎదురుగ్గా చూస్తే ఆడపిల్లలకు ఒక్క మేష్టారే అవుపడతాడు. మొగపిల్లలకు అటు మేష్టారూ, ఇటు ఆడపిల్లలూ, అంతా ఎదురుగ్గా అవుపడతారు. అసలా మొగపిల్లల్లో ఎంతోమంది మేష్టారు వంక చూస్తేగా. అంతా ఆడపిల్లలవైపే చూస్తారు. ఒకవేళ ఏ ఆడపిల్లేనా తలకాయ కొంచెం అటు తిప్పితే తక్కిన ఆడపిల్లలు బతకనిస్తేగా, గోలచేసి వదిలిపెట్టరూ! ఐతే ఎవరూ అంతమాత్రాన అటు చూళ్లేదని కాదు. కల్యాణికిగానీ, మరే ఆడపిల్లకైనాగానీ ఏపిల్లాడు ఎట్లా ఉంటాడో తెలీకపోలే. ఎవరికి యెవరు నచ్చినప్పటికీ కల్యాణి ఉద్దేశ్యంలో మాత్రం కమలాకర్ అందమైనకుర్రాడు. ఆ సొట్టపడే బుగ్గలూ, నవ్వే కళ్లూ, సన్నటిగడ్డం, తిన్ననిముక్కూ, నొక్కుల జుట్టూ. ఆ ఒంపు పెదవులమధ్యనుంచివచ్చే కెంపులనవ్వూ- ఇంతెందుకు, కల్యాణికళ్ళకు స్వాతంత్ర్యం దొరికితే తప్పకుండా కమలాకర్ వంకే చూస్తూ కూర్చుంటయ్. అతడు తనకన్నా చిన్నో పెద్దో తెలీదు, అంతలేతగా ఉంటాడు. బహుశా చిన్నేనేమోమరి. ఏమైనా అప్పుడప్పుడు కల్యాణి మనస్సు ఇట్లా పోతుంటుంది: 'కమలాకర్ తో పెళ్ళయితే ఎంతబావుండును.' ఆ ఎర్రటి పెదిమెలూ, తెల్లటి బుగ్గలూ, నల్లటిజుట్టూ- ఈభావన వచ్చినప్పుడల్లా పెదిమెలు తడిసిపోతుంటయ్, వెంటనే తెలివితెచ్చుకొని మనసుకు కళ్లెంవేసి 'అబ్బ, చాల్లే, మరీనూ' అని మనస్సును అదమాయిస్తూ ఉండేది. ఇదీ కలకు సంబంధించినంతవరకూ కమలాకర్ విషయం.

ఇల్లాంటి సందర్భాల్లో కల్యాణికి కలొచ్చింది. కలలో కల్యాణికి పెళ్లయింది. కలలో ఒచ్చిన మొగుడు ఎట్లా ఉంటాడో సరిగ్గా జ్ఞాపకంలేదు గాని, మొత్తంమీద మోటుగా, పెద్ద పెద్ద మీసాల్తో, మిడిగుడ్లతో, కిర్రుచెప్పుల్తో, జరీ ఉత్తరీయంతో ఘోరంగా ఉంటాడని మాత్రం జ్ఞాపకం. ఆయన పేరు సరిగా ఆఅమ్మాయికే జ్ఞాపకంలేదు. కాబట్టి ఆయన్ను కొండయ్య అని పిలవటంలో ఏమీ అభ్యంతరం ఉండాల్సిన అవసరంలేదు. కొండయ్య మూర్ఖుడు. రోజూ తాగొచ్చి పెళ్లాన్ని తంతూ ఉండేవాడు. రోజూ డబ్బివ్వమని వేధిస్తూ ఉండేవాడు. డబ్బు తనెక్కడతెచ్చేదో జ్ఞాపకం లేదుగాని, అడిగినప్పుడల్లా నాలుగు తన్నులుతిని రూపాయలిస్తూ ఉండేది.

తరువాత కొన్నాళ్లకు కమలాకర్ అవుపించాడు. బహుశా సినిమాహాల్లో అయ్యుంటుంది. సినిమామీద ధ్యాసలేదుకాబట్టి ఏసినిమా ఆడిందీ, అసలది సినిమాహాలయిందీ కూడా మరిచిపోయింది. చీకట్లో తడువుకుంటూ అతని దగ్గరకుపోయింది. తలకాయవంచుకొని 'కమలాకర్ !' అని పిల్చింది. ఆఅబ్బాయి తనముఖం పరీక్షించి ఆశ్చర్యపోయి సన్నగా ముద్దుగా 'కల్యాణీ !' అన్నాడు. తను కళ్లంట నీరుకార్చింది. ఆచీకట్లో చీకటికొలకుల్లో మెరిసే తారల్లాంటి నీటిచుక్కల్ని తన తెల్లటి రుమాల్తో అద్దాడు. తరువాత తన సంగతంతా చెప్పింది. అతనిఒళ్లో తలపెట్టి ఏడ్చింది. అతను తలనిమురుస్తూ బుజ్జగించాడు. అతనితో వెన్నెట్లో రోడ్డుమీద నడుచుకుంటూ ఇంటికి పోయింది. కమలాకర్ తనకు ధైర్యంచెప్పి వెనక్కుపోయాడు. ఆరోజునుంచీ మొగుణ్ణి ఎదిరించటానిక్కూడా ధైర్యంవచ్చిందని జ్ఞాపకం.

అప్పట్నించీ రోజూ కమలాకర్ కలిసేవాడు: కాలవగట్టునో, చెరువుఒడ్డునో, పార్కులోనో, ఎక్కడనో, ఎవ్వరూచూడని పొదరింట్లో.

ఒకరోజు కొండయ్య ఊళ్లోనించి వెళ్ళిపోయాడు. కమలాకర్ని తనింటికి రమ్మంది. అతను ఇంటికొచ్చాడు. ఆరాత్రి లైటువెల్తుర్లో కమలాకర్ ముఖం ఎంతో అందంగా అవుపించింది. తెల్లటిలాగూ, తెల్లటిచొక్కా, సన్నగా దువ్విన జుట్టూ, మెరిసేకళ్లూ, తళతళలాడే చెంపలూ, ఖరీ ఎరుపెక్కిన పెదిమెలూ, ముఖంమీద అక్కడక్కడ మెరిసే చెమటచుక్కలూ, ఆ మన్మథుడెట్లా ఉంటాడో తెలీదు. బహుశా ఇంతఅందంగా ఉండిఉండడు. అతని చెంపను చెంపఆనించి, తన మల్లెపూలవాసన తనను మత్తెక్కిస్తుంటే, తన్నూ, ప్రపంచాన్నీ, తనకు పెళ్ళయిందనే విషయాన్నీ మరిచిపోయింది.

ఆ తరువాత కథ ( కల ? ) చివరి ఆశ్వాసంలో కొచ్చింది. బయట ఉరుము ఉరిమినట్టూ, పిడుగు పడ్డట్టూ, కొండయ్య గర్జించినట్టూ ధ్వనైంది. తలుపు చప్పుడైంది. తాగి మతిపోగొట్టుకున్న కొండయ్య ఊరికిపోకుండా తిరిగి ఇంటికొచ్చాడు. తలుపు తియ్యగానే లోపల విరుచుకుపడి గుడ్లు వురిమి, పళ్లు కొరికి, గర్జించాడు. కమలాకర్ని జుట్టు పట్టుకొని కిందపడేసి మెడమీద కాలువేసి జేబులో నించి చాకు తీశాడు. కమలాకర్ మాట్లాట్టానికి ప్రయత్నించాడు గాని ఆ మొరటుకాలు ఆ లేత మెడను నలిపేస్తోంది. కుడిచేయి పైకెత్తాడు. 'హారోం——హరా——' అని అరుస్తూ, ఒస్తోంది కిందికి, మెడమీదికి, రంయిమని.....కాసేపట్లో చిందుతుంది నెత్తురు-గదంతా, గుడ్డలమీదా, అతని పాల బుగ్గలమీదా. కల్యాణి కళ్లు మూసేసుకుంది గట్టిగా అరుద్దామనుకుందిగాని గొంతు పూడిపోయింది. ఎట్లానో 'అమ్మో' అని కేకేసింది, కలలో. కల్యాణి 'అమ్మో' అని కేకేసింది నిద్దర్లో. అమ్మ లేచొచ్చింది.

'ఎందుకే తల్లీ, కలవరిస్తున్నావు ?'

'అబ్బ, పాడుకలొచ్చిందే, అన్నీ దయ్యాలూ అవ్వీనీ !'

'మామ్మ గదే, నా దగ్గరపడుకోమ్మావచ్చి.' అమ్మనుపోయి గట్టిగా కావలించుకొని పడుకుంది. కళ్లు మూసుకోటానికి భయం. మళ్లీ కొండయ్యా నెత్తురూను.

ఆ రాత్రల్లా దేవతల్ని ప్రార్థిస్తూ పడుకుంది, కమలాకర్ కేమీ ఆ పద రానీకండని.